


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
20 జులై 2024
పేజీలు: 02

## కేతిరెడ్డి పెద్దారెడ్డితో ప్రాణహాని ఉంది: జేసీ ప్రభాకర్‌రెడ్డి



గత వైసీపీ ప్రభుత్వంలో అనేక సమావేశాల్లో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తాను ఫ్యాక్షన్ చేస్తానని బహిరంగంగా అన్నారు. అతని నుంచి తనకు, తాడిపత్రి ప్రజలకు ప్రాణహాని ఉందని తాడిపత్రి పురపాలక అధ్యక్షుడు జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దారెడ్డి, అతని కుమారులు హర్షవర్ధన్‌రెడ్డి, సాయిప్రతాప్‌రెడ్డిలను జిల్లా బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. తాడిపత్రి పురపాలక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో తమకు సంబంధించిన బస్సులపై అక్రమంగా కేసులు నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. లేదంటే అనంతపురంలోని 1వ పట్టణ పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయిస్తానన్నారు. ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకుని పెద్దారెడ్డి చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావన్నారు. తాజాగా పెద్దవడుగూరులో వైసీపీ నాయకులు మామిడి చెట్లు నరికితే కేసు కూడా పెట్టరా అని ఆయన ప్రశ్నించారు.

## భారతదేశాన్ని బ్లాక్ లిస్టులో పెట్టిన టర్కీ!



ఇండియాకు ఊహించని షాక్ ఇచ్చింది టర్కీ దేశం. భారతదేశాన్ని బ్లాక్ లిస్టులో పెట్టింది టర్కీ. భారత్ నుండి ఆయుధాలు మరియు రక్షణ సంబంధిత వస్తువుల ఎగుమతిపై టర్కీ పూర్తిగా నిషేధాన్ని విధించింది టర్కీ దేశం. ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుల్లో ఒకటైన భారత్‌కు సైనిక పరికరాలను ఎగుమతి చేయడంపై టర్కీ ప్రభుత్వం సమగ్ర నిషేధం విధించింది. భారత షిప్‌యార్డ్‌లో షిప్‌బిల్డింగ్ ప్రాజెక్ట్‌లో నిమగ్నమైన టర్కీ సంస్థతో న్యూఢిల్లీ ఒప్పందాన్ని రద్దు చేసిన కొన్ని నెలల తర్వాత ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. టర్కీ, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న హాబ్‌నాబింగ్‌తో, అంతర్జాతీయ సమస్యలపై భారతదేశం టర్కీకి వ్యతిరేకంగా వైఖరిని తీసుకుంటోంది.




## ఎల్లుండి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 22 నుంచి 5 రోజుల పాటు జరగనున్నాయి. శాసనసభ, శాసనమండలిని ఉద్దేశించి గవర్నర్ చేసే ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం అవుతాయి. 4 నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ నెల 25 లేదా 26న బడ్జెట్‌కు ఆమోదం తెలపనున్నట్లు సమాచారం. అసెంబ్లీలో అర్థవంతమైన, ఫలవంతమైన చర్చలు జరగాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు.



## బీజేపీ హయాంలో రూ.300 కోట్ల స్కామ్

### కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం హయాంలో రూ.300 కోట్ల స్కామ్ జరిగిందని ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆరోపించారు. బీజేపీ నేతలను ఉద్దేశిస్తూ 'ఫాదర్స్ ఆఫ్ కరప్షన్' అని కామెంట్స్ చేశారు. యడియూరప్ప, బసవరాజు బొమ్మై నేతృత్వంలోని ప్రభుత్వాల హయాంలో ఈ కుంభకోణాలు జరిగాయని, వీటిపై విచారణ జరిపిస్తామని మీడియాతో చెప్పారు. స్కామ్ వివరాలను అసెంబ్లీలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

## త్వరలో మేడిగడ్డను సందర్శిస్తా: కేటీఆర్

తాను త్వరలో మేడిగడ్డ బ్యారేజీని సందర్శిస్తానని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. 'నిజం ఎప్పుడూ గెలుస్తుంది' అని ట్వీట్ చేశారు. 'కాంగ్రెస్ కుట్రలను తట్టుకొని కాళేశ్వరం ప్రాజెక్టు నిలిచింది. మేడిగడ్డ బ్యారేజీ నిండుకుండలా మారింది. లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుంది' అంటూ బీఆర్ఎస్ పార్టీ పోస్ట్ చేసిన డ్రోన్ వీడియోపై ఆయన ఈ విధంగా స్పందించారు.



## ఆ కారణం వల్లే క్రాష్ అయ్యాయి

మైక్రోసాఫ్ట్ విండోస్ క్రాష్ అవడంపై ఆ సంస్థ సీఈఓ సత్య నాదెల్ల ట్విటర్‌లో వివరణ ఇచ్చారు. 'సైబర్ సెక్యూరిటీ సంస్థ క్రౌడ్‌స్ట్రైక్ నిన్న ఓ అప్‌డేట్ రిలీజ్ చేసింది. అదే క్రాష్‌కు కారణం. సమస్యను గుర్తించాం. కస్టమర్స్‌కు సాంకేతిక గైడెన్స్ అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రపంచ చరిత్రలోనే ఇది అతి పెద్ద సంక్షోభం. త్వరలోనే పరిష్కరిస్తాం' అని తెలిపారు. అటు క్రౌడ్‌స్ట్రైక్ కూడా కస్టమర్స్‌కు సారీ చెప్పింది.

## జాబిలిపై తొలి అడుగుకి 55 ఏళ్లు



జాబిలిపై తొలి అడుగుకి 55 ఏళ్లు. సరిగ్గా ఇదే రోజు.. జూలై 20, 1969న మానవుడు చంద్రుడిపై అడుగు పెట్టాడు. నాసా 1968 లో 'అపోలో-11'లో వ్యోమగాములు నీల్ ఆర్మ్ స్ట్రాంగ్, మైకెల్ కొల్లిన్స్, ఎడ్విన్ ఇ అల్డ్రిన్‌లను చంద్రుడి పైకి పంపింది. నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ మొదటిగా చంద్రుడిపై కాలు మోపి రికార్డులకు ఎక్కాడు. ఆర్మ్‌స్ట్రాంగ్ అడుగుపెట్టిన 20 నిమిషాల తర్వాత.. అల్డ్రిన్ చంద్రుడిపై కాలు మోపాడు.

## రైతు రుణమాఫీ డబ్బులు రాలేదని ఫిర్యాదులు

రూ.లక్ష రుణమాఫీ తమకు జరగలేదంటూ వ్యవసాయ శాఖకు భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. గ్రామాలు, మండలాలు, జిల్లా స్థాయుల్లో ఏఈవో, ఏవో, ఏడీఏ, డీఏవోలకు రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. తమకు రుణమాఫీ జరిగిందో లేదో తెలుసుకునేందుకు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రూ.లక్షలోపే రుణం ఉన్నా ఎందుకు మాఫీ కాలేదంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. మీకు రుణమాఫీ డబ్బులు జమ అయ్యాయా? కామెంట్ చేయండి.



## 10 కిలోల బరువు తగ్గిన ఎమ్మెల్సీ కవిత?

తిహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవిత 4 నెలల్లో 10 కిలోల బరువు తగ్గినట్లు సమాచారం. కోర్టు ఆదేశాల మేరకు జైలు అధికారులు నిన్న ఆమెను ఎయిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమె భర్త సమక్షంలో వైద్య పరీక్షలు పూర్తి కాగా, ఆమె 10 కేజీల బరువు తగ్గినట్లు తెలిసింది. టెస్టుల అనంతరం ఆమెను తిరిగి జైలుకు తరలించారు. కవితను పరామర్శించేందుకు కేటీఆర్, హరీశ్ రావు ఎల్లుండి ఢిల్లీకి వెళ్లనున్నట్లు సమాచారం.




### ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన వారికి

# రూ.లక్ష ఆర్థిక సహాయం

నేడు "రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం" పథకాన్ని ప్రారంభించన సీఎం రేవంత్ రెడ్డి. ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ. లక్ష ఆర్థిక సహాయం చేయనున్న కాంగ్రెస్ ప్రభుత్వం.సివిల్స్ అభ్యర్థులకు చేయూతనిచ్చేలా ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని ప్రజా భవన్‌లో శనివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులకు సింగరేణి సంస్థ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందించను న్నారు. అంతకుముందు సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్



రెడ్డి, సీతక్క, సీఎం సలహాదారు (ప్రోటోకాల్) హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యేలు, ఎంపీ లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సింగరేణి సీఎండీ బలరామ్ ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం: సీఎం**

విద్యార్థుల త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడానికే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. 'నిరుద్యోగుల బాధలు మాకు తెలుసు. వారి విజ్ఞప్తి మేరకే గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేశాం. అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం. ఏటా డిసెంబర్ 9 నాటికి ఉద్యోగాల భర్తీ పూర్తి చేస్తాం. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సలో మార్పులు చేపట్టాం' అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

## 91 టెస్టులు ఆడాడు.. ఒక్క టీ20 కూడా ఆడలేదు..!



వెస్టిండీస్ ఓపెనర్ క్రెగ్ బ్రాత్‌వైట్‌ది విచిత్ర పరిస్థితి. ఇప్పటివరకు ఆయన 91 టెస్టులు ఆడారు. కానీ ఒక్క టీ20 మ్యాచ్ కూడా ఆడలేదు. దీంతో 50కుపైగా టెస్టు మ్యాచ్‌లు ఆడి ఒక్క టీ20 కూడా ఆడని ఏకైక ప్లేయర్‌గా బ్రాత్‌వైట్ చరిత్ర సృష్టించారు. 2011 నుంచి ఆయన క్రికెట్ ఆడుతున్నా డొమెస్టిక్‌లోగానీ, అంతర్జాతీయంగాగానీ పొట్టి ఫార్మాట్‌లో బరిలోకి దిగలేదు.



## ఆ ఓవర్లో రోహిత్ చాలా మద్దతునిచ్చారు: అక్షర్

టీ20 వరల్డ్‌కప్-2024 ఫైనల్లో అక్షర్ పటేల్ ఓవర్‌లో సౌతాఫ్రికా బ్యాటర్ క్లాసెన్ విధ్వంసం సృష్టించారు. అయినా సరే తనకు అప్పటి కెప్టెన్ రోహిత్ శర్మ మద్దతుగా నిలిచారని అక్షర్ తెలిపారు. 'ఓవర్ మధ్యలో రోహిత్ నా వద్దకు వచ్చారు. ఓవర్ అయిపోయాక కూడా నా భుజం తట్టి బాగానే వేశావు, టెన్షన్ పడకంటూ ధైర్యమిచ్చారు' అని గుర్తుచేసుకున్నారు.



## కిల్లర్ లుక్‌లో సోనియా

బిగ్ బాస్ 17 కంటెస్టెంట్ సోనియా బన్సాల్ కిల్లర్ స్టైల్ ఉంది, సోనియా బన్సాల్ ఫోటోలు ఇంటర్నెట్‌లో వచ్చిన వెంటనే పాపులర్ అవుతాయి. అందం విషయానికొస్తే, సోనియా బన్సాల్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 6.2 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. సోనియా యొక్క ఈ కిల్లర్ లుక్ తప్పక చూడండి బిగ్ బాస్ 17 కంటెస్టెంట్ సోనియా బన్సాల్ విభిన్నమైన డ్రెస్సింగ్ సెన్స్‌తో ఉన్నారు. ఆమె లుక్‌కి లక్షలాది మంది పిచ్చెక్కిస్తున్నారు.



## గ్రూప్2 పరీక్ష వాయిదాకు కారణాలివే!

గ్రూప్2 పరీక్ష వాయిదా పడ్డ విషయం తెలిసిందే. 2023 ఆగస్టులో జరగాల్సిన పరీక్షలు 2024 జనవరి, ఆ తర్వాత ఆగస్టుకి వాయిదా పడ్డాయి. కాగా తాజా ఖాళీల ప్రకారం పోస్టులు పెంచి కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలనేది ఓ డిమాండ్. డీఎస్సీ, గ్రూప్2 పరీక్షల మధ్య వ్యవధి తక్కువుండటంతో గ్రూప్2 వాయిదా వేయాలని మరో డిమాండ్. నవంబర్‌లో గ్రూప్3, డిసెంబర్‌లో గ్రూప్2 పెడితే ఈ 2 పరీక్షల సిలబస్ దాదాపు ఒకటే కావడంతో ప్రిపరేషన్ ఈజీ అవుతుందనేది అభ్యర్థుల వాదన.



## భారీ వర్ష సూచన.. కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. 'ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా, ప్రమాదకర వాగులను ప్రజలు దాటకుండా చూడాలి. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి' అని ఆదేశించారు. పెద్దపల్లి, కరీంనగర్, మిర్యాలగూడ, కొమురంభీం, మంచిర్యాల, హన్మకొండ, జగిత్యాల, ఖమ్మం, కొత్తగూడెం, నిర్మల్ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించిందని పేర్కొన్నారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## ప్రధాని మోదీకి కంగ్రాట్స్: ఎలాన్ మస్క్

భారత ప్రధాని నరేంద్ర మోదీకి టెస్లా, ట్విటర్(X) అధినేత ఎలాన్ మస్క్ అభినందనలు తెలిపారు. ఎక్స్‌లో అత్యధిక మంది ఫాలోవర్లను పొందిన వరల్డ్ లీడర్‌గా నిలిచిన సందర్భంగా విషెస్ తెలుపుతూ ట్వీట్ చేశారు. ఎక్స్‌లో పీఎం మోదీ ఫాలోవర్ల సంఖ్య ఇటీవల 100M దాటింది. ఆయన తర్వాత యూఎస్ అధ్యక్షుడు బైడెన్ 38.1M, టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగాన్ 21.5M ఫాలోవర్లను కలిగి ఉన్నారు. యూఎస్ మాజీ అధ్యక్షుడు ట్రంప్‌కు 87.7M ఫాలోవర్లు ఉన్నారు.

## ఏఐ హబ్స్‌గా అమరావతి, విశాఖ: సీఎం చంద్రబాబు

రానున్న రోజుల్లో ఏఐతో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని సీఎం చంద్రబాబు అన్నారు. 'వికసిత్ ఏపీ-2047 విజన్ డాక్యుమెంట్'పై నీతి ఆయోగ్ ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. 'రాష్ట్రంలో ఏఐ వర్సిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం. అమరావతి, విశాఖను ఏఐ హబ్స్‌గా రూపొందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. కొత్త టెక్నాలజీ, అవకాశాలను అందిపుచ్చుకునే విధానాలు డాక్యుమెంట్‌లో ఉండాలి' అని స్పష్టం చేశారు.


## బోటులో భారీ అగ్నిప్రమాదం.. 40 మంది మృతి

హైతీ తీరంలో ఓడలో మంటలు చెలరేగడంతో పెను ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కనీసం 40 మంది వలసదారులు మృతిచెందారని స్థానిక అధికారులను ఉటంకిస్తూ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ తెలిపింది. 80 మందికి పైగా వలసదారులతో కూడిన ఓడ బుధవారం హైతీ నుండి బయలుదేరి టర్క్స్, కైకోస్‌కు బయలుదేరిందని IOM శుక్రవారం తెలిపింది. సమాచారం అందుకున్న హైతీ కోస్ట్ గార్డ్ 40 మందిని కాపాడినట్లు తెలుస్తోంది.



## వర్షం.. వరద.. విలయం!

వర్షాలతో ఏపీ అతలాకుతలం అవుతోంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర జిల్లాల్లో విలయం అంతాఇంతా కాదు. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. రోడ్లు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. కట్టలకు గండ్లు పడ్డాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనేక గ్రామాలు దీవుల్ని తలపిస్తున్నాయి. కొండప్రాంతాల్లో చరియలు విరిగిపడుతున్నాయి. ఈ ప్రకృతి విలయాన్ని చూసి ప్రజలు వణికిపోతున్నారు.



### బంగ్లాదేశ్ అల్లర్లలో 105 మంది మృతి..

# దేశవ్యాప్త కర్ఫ్యూ విధింపు

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు, నిరుద్యోగుల ఆందోళన దేశ వ్యాప్తంగా నిరసనలు ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేయాలని డిమాండ్ జైలులోని ఖైదీలను విడిపించి, జైలుకు నిప్పు పెట్టిన ఆందోళనకారులు పోలీసు వ్యవస్థ విఫలం కావడంతో రంగంలోకి మిలటరీ విద్యార్థులు, నిరుద్యోగుల ఆందోళనలతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు చెలరేగాయి. దీంతో షేక్ హసీనా ప్రభుత్వం దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించింది. విద్యార్థుల ఆందోళనలను అదుపు చేయడంలో పోలీసులు విఫలం కావడంతో మిలటరీని రంగంలోకి దించింది. కాగా, ఆందోళనల్లో ఇప్పటి వరకు 105 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్క రాజధానిలోనే 52 మంది మృతి చెందారు. ఎక్కువ మరణాలకు పోలీసుల కాల్పులే కారణమని తెలుస్తోంది.

ఇంటర్నెట్ నిలిపివేత

రాజధాని ఢాకాలో ర్యాలీలు, ప్రదర్శనలు, ప్రజలు గుమికూడడాన్ని నిషేధించారు. ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. ప్రభుత్వం ఎన్ని నిషేధాలు విధించినా తమ ఆందోళన కొనసాగుతుందని విద్యార్థులు తెగేసి చెబుతున్నారు. ఈ మరణాలకు ప్రధాని షేక్ హసీనానే కారణమని, ఆమె వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జైలుకు నిప్పు

నర్సింగ్డి జిల్లాలో ఆందోళనకారులు జైలులోకి దూసుకెళ్లి ఖైదీలను విడుదల చేశారు. అనంతరం జైలుకు నిప్పు పెట్టారు. జైలు నుంచి వందలాదిమంది ఖైదీలు పారిపోయినట్టు పోలీసులు తెలిపారు. విద్యార్థి ఆందోళనకారులపై దాడులు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయని, ఇది ఆమోదయోగ్యం కాదని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఎందుకీ ఆందోళనలు


స్వతంత్ర దేశం కోసం పాకిస్థాన్‌తో 1971లో జరిగిన విముక్తి యుద్ధంలో పాల్గొన్న వారి పిల్లలు సహా కొన్ని నిర్దిష్ట సమూహాలకు సగానికిపైగా సివిల్ సర్వీస్ పోస్టుల్లో రిజర్వ్ చేసిన కోటా వ్యవస్థకు ముగింపు పలకాలంటూ ఈ నెలలో విద్యార్థులు, నిరుద్యోగులు ఆందోళనలకు పిలుపునిచ్చారు. ప్రధాని హసీనాకు మద్దతునిచ్చే ప్రభుత్వ అనుకూల గ్రూపుల పిల్లలే ఈ పథకం నుంచి లబ్ధి పొందుతున్నారన్న విమర్శలున్నాయి.

## యూపీఎస్‌సీ చైర్మన్ మనోజ్ సోనీ రాజీనామా..



యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) చైర్మన్ మనోజ్ సోనీ రాజీనామా చేశారు. పదవీకాలం పూర్తికాక ముందే రాష్ట్రపతికి తన రాజీనామా పత్రాన్ని పంపారు. వ్యక్తిగత కారణాలతో సోనీ రాజీనామా చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన రాజీనామా ఆమోదంపై అధికారిక వెలువడాల్సి ఉంది. మనోజ్ సోనీ పదవీకాలం 2029లో ముగియాల్సి ఉండగా, అంతకు ముందే ఆయన రాజీనామా చేశారు. సోనీ 2017లో యూపీఎస్‌సీలో సభ్యులుగా చేరారు. 16 మే 2023న, అతను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యాయి. ఇకపై మనోజ్ సోనీ గుజరాత్‌లోని స్వామినారాయణ శాఖకు చెందిన అనుపమ్ మిషన్‌కు ఎక్కువ సమయం కేటాయించాలనుకుంటున్నట్లు సమాచారం. 2020లో దీక్షను స్వీకరించిన తర్వాత, అతను అనుపమ్ మిషన్‌లో సాధు కర్మయోగి అయ్యారు. మనోజ్ సోనీ రాజీనామా అంశం ఐఏఎస్ పూజా ఖేద్కర్‌కు సంబంధించినది కాదని అధికార వర్గాలు చెబుతున్నాయి. మూడుసార్లు వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన డాక్టర్ సోనీ, అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించారు. 2005లో దేశంలోనే అతి పిన్న వయస్కుడైన యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ అయ్యారు.

## రెండు గ్రామాలను దత్తత తీసుకోనున్న నారా భువనేశ్వరి!



సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఈనెల 23, 24, 25, 26 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. నియోజకవర్గంలో ఉత్తమ మెజారిటీ వచ్చిన గ్రామాలను దత్తత తీసుకుంటామని ఆమె ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు పర్యటనలో భాగంగా ఆమె రెండు గ్రామాలను దత్తత తీసుకోనున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మునిరత్నం తెలిపారు.




## నాకు ఏ మహిళతోనూ అక్రమ సంబంధాలు లేవు

### శాంతిని కూతురుగానే చూసా: విజయసాయి

తనకు ఏ పరాయి మహిళతోనూ అక్రమ సంబంధాలు లేవని విజయసాయి రెడ్డి తెలిపారు. వెంకటేశ్వర స్వామి సన్నిధిలో కూడా ఇదే మాట చెప్తానని ట్వీట్ చేశారు. 'శాంతి కళింగిరిని 2020లో ఏపీ ఎండోమెంట్స్ ఆఫీసర్‌గా తొలిసారి మీట్ అయినప్పటి నుంచి ఇప్పటివరకు కూతురుగానే భావించాను. ఒక తండ్రిలా ఏ సహాయం కావాలన్నా చేశాను. తనకు కొడుకు పుట్టాడంటే వెళ్లి పలకరించాను. మా తాడేపల్లి ఇంటికి తీసుకొస్తే ఆశీర్వదించాను' అని పేర్కొన్నారు.



## గ్లామరస్ లుక్‌లో అనన్య

ప్రముఖ బాలీవుడ్ నటి అనన్య పాండే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉన్న అనన్య పాండే యొక్క ఈ తాజా చిత్రాలను చూడటం ద్వారా ప్రముఖ బి-టౌన్ నటి అనన్య పాండే తన అందాన్ని ఊహించవచ్చు. అనన్య పాండే యొక్క తాజా చిత్రాలను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పంచుకున్న అనన్య పాండే యొక్క ఈ చిత్రాలలో, ఆమె చాలా అందంగా మరియు ఆకర్షణీయంగా ఉందని మీరు చూడవచ్చు గ్లామరస్ లుక్‌లో ఉంది

### వాయుగుండంగా మారిన అల్పపీడనం

# ఏపీ, తెలంగాణకు అతి భారీ వర్ష సూచన..

**తెలుగు రాష్ట్రాలకు రెండు రోజులు ఫుల్ వానలే..**

నైరుతి రుతుపవనాల కారణంగా ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో జోరు వానలు కురుస్తున్నాయి. అయితే ఇవాళ తెలుగురాష్ట్రాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం సముద్ర మట్టానికి 1.5 కి. మీ ఎత్తులో వాయుగుండం కొనసాగుతోంది. 20 డిగ్రీల ఉత్తర అక్షాంశం గుండా సగటు సముద్ర మట్టానికి 3.1 కి. మీ. నుండి 5.8 కి. మీ ఎత్తు మధ్యలో కొనసాగుతోంది. ఒడిశా,ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో వాయుగుండంగా బలపడిన అల్పపీడనం, ఇవాళ వాయువ్య దిశగా పయనించి పూరీ సమీపంలో ఒడిశా తీరం దాటే అవకాశం ఉంది. ఆ తరువాత క్రమంగా బలహీనపడనున్న వాయుగుండం. ఏపీలో రెండు జిల్లాలకు రెడ్ అలర్ట్.. పన్నెండు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది ఐఎండీ. ఇవాళ శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు, ఏలూరు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అటు గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, కర్నూలు అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో అల్పపీడనం కాస్తా వాయుగుండంగా మారి ఒడిశావైపు వస్తోంది. అల్పపీడన ద్రోణి వాయుగుండంగా మారటంతో ఉమ్మడి గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు సాధారణ జనజీవనంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఇప్పటికే కురుస్తున్న కుండపోత వర్షాలతో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యారు. వర్షాల కారణంగా పశ్చిమ గోదావరి, కోనసీమ, విశాఖ జిల్లాల్లో ఇవాళ స్కూళ్లకు సెలవు ప్రకటించారు. తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉండడంతో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచన జారీ చేశారు వాతావరణ అధికారులు. ఇప్పటికే అత్యవసర సహాయక చర్యల కోసం 3ఎస్డీఆర్ఎఫ్, 2 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపింది రాష్ట్ర సర్కార్. లోతట్టు ప్రాంతాల్లో వరద ప్రవహిస్తున్నవాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

